
andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3 ౹ కనిష్ఠం 22.3



నేడు ఎమ్మెల్సీ, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ రాక

నందిపేట, మార్చి9: మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామానికి ఆదివారం ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్ వస్తున్నట్లు ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ తెలిపారు. సీఎం కప్ పేరుతో జరుగుతున్న క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు వస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు హాజరుకావాలని కోరారు. గెలిచినజట్లకు ఎమ్మెల్సీ, రాష్ట్ర ఉర్దూ అకాడమిచైర్మన్ నగదు బహుమతులను అందజేస్తారని తెలిపారు.



హుస్సేన్‌నగర్‌లో ఎండిన పంటను కోసి పశువులకు వేసిన రైతు

కొండాపూర్‌తో ట్యాంకర్లతో పొలాలకు నీటిని అందిస్తున్న రైతు

ధర్పల్లి మండలం కార్నార్ తండాలో ఎండుతున్న పంటలు

ఆశలు ఆవిరి!

- జిల్లాలో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- లక్షలు వెచ్చించి కొత్త బోర్లు వేస్తున్నా పడని నీరు
- ట్యాంకర్లతో పంటలకు నీరందిస్తున్న అన్నదాతలు
- నీరు అందించలేక పంటలను పశువులను మేపుతున్న కొంత మంది రైతులు
- చేతికొస్తున్న పంటను కాపాడుకోలేకపోతున్నామంటూ రైతుల ఆవేదన

నిజామాబాద్, మార్చి9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. మెట్ట ప్రాంతాల్లో వేసిన వరి పంట ఎండిపోతోంది. భూగర్భ జలాలు, చెరువుల్లో నీళ్లు ఉన్నవి ఆశతో యాసంగిలో సాగుచేసిన రైతులకు భూగర్భ జలాలు అడుగండటంతో ఇబ్బందులు పడుతున్నారు. పంటను కాపాడుకునేందుకు కొత్తగా బోర్లు వేస్తూ లక్షల రూపాయలు ఖర్చులు చేస్తున్నారు. కొంతమంది రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇన్ని చేసినా నీళ్లు లేక వరి ఎండిపోవడంతో పశువులకు వదిలిపెడుతున్నారు. బోర్ల కోసం లక్షల రూపాయల ఖర్చు చేసి వందల ఫీట్లు వేసినా నీళ్లు రాకపోవడంతో రైతులు అప్పుల బారిన పడుతున్నారు. ప్రాజెక్టులు లేకపోవడం వల్ల రైతులు వరి ఎండిపోయి భారీగా నష్టపోతున్నారు.

పంటలకు నీరందించేందుకు రైతుల అష్టకష్టాలు

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు లేని భీమ్‌గల్, సిరికొండ, ధర్పల్లి, ఇందల్‌వాయి, జక్రాన్‌పల్లితోపాటు పలు మండలాల పరిధిలో వరిసాగు చేసిన రైతులు పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. చెరువుల్లో నీళ్లు ఉండటం, భూగర్భజలాలు పైననే ఉండటం, విద్యుత్ సరఫరా నిరంతరం ఉండటంతో ఎక్కువమంది రైతులు వరిసాగు వైపు మొగ్గు చూపారు. జిల్లాలో ఈ యాసంగిలో రైతులు ఎప్పుడూ వేయలేనంతా 4లక్షల 6వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఈ పంటల కోసం భారీగా నీటిని వినియోగిస్తున్నారు. అన్ని మండలాల్లో వరి సాగు చేయడంతో నీటి వినియోగం భారీగా పెరిగింది. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులతో పాటు గుత్ప అలీసాగర్, లక్ష్మీ, కాకతీయ కాలువల పరిధిలో నీటి వినియోగం ఎక్కువైన ప్రాజెక్టుల నుంచి నీళ్లు విడుదల చేయడంతో రైతులకు అంతగా ఇబ్బంది లేదు. నీళ్లు రాని సమయంలో ఆ పరివాహక ప్రాంత రైతులు బోర్లను వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు ఆయకట్టులేని మండలాల పరిధిలోని రైతులకు మాత్రమే ఎక్కువగా ఇబ్బంది ఏర్పడింది. చెరువుల్లో నీటి మట్టం భారీగా తగ్గిపోవడం, భూగర్భ జలాల వినియోగం పెరిగి నీటి మట్టాల లోతుల్లోకి వెళ్లడంతో వరి పంటకు నీరు సరిపోవడం లేదు. ఈ నాలుగు మండలాలతో పాటు మరికొన్ని మండలాల పరిధిలోని ఆయకట్టు లేని రైతులు పంటలను కాపాడుకునేందుకు తిప్పలు పడుతున్నారు. పంట పొట్ట దశలో ఉండటం, నీరు బాగా అవసరం ఉన్న సమయంలో బోర్లు ఎత్తిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొంత మంది రైతులు పంటలను కాపాడుకునేందుకు ఒకటి నుంచి నాలుగు వరకు కొత్త బోర్లను వేస్తున్నారు. అయినా ఫలితం ఉండటం లేదు. కొంత మంది రైతులు బోర్లు వేసినా భూగర్భ జలాలు అడుగండటం వల్ల నీరు రాకపోవడంతో అదనంగా రూ.లక్షల్లో అప్పుల పాలవుతున్నారు. ఒక్కో బోరుకు రూ.50వేల నుంచి లక్ష రూపాయల వరకు వెచ్చించడంతో భారీ ఎత్తున నష్టపోతున్నారు. కొంతమంది రైతులు పంటలను ఎలాగైనా కాపాడుకోవాలని నీటిట్యాంకర్లను కిరాయికి మాట్లాడుకొని నీళ్లు తెచ్చి పంటలకు వేస్తున్నారు.

నీరందించలేక పంటలను వదిలేస్తున్న రైతులు

జిల్లాలోని సిరికొండ, ధర్పల్లి మండలాల పరిధిలోని కొంతమంది రైతులు నీటిట్యాంకర్లను కిరాయికి మాట్లాడుకొని పంటకు నీరు అందిస్తున్నారు. మరికొంత మంది రైతులు కొత్త బోర్లు వేయలేక, నీళ్లు చాలక పంటలను వదిలివేస్తున్నారు. తమకు ఉన్న పశువులకు మేతగా వినియోగిస్తున్నారు. యాసంగి సాగు సమయంలో నీరు ఉండటంతో ఆరుతడి పంటలకు బదులు వరి సాగు వేసిన రైతులకు భారీగా పంటలు ఎండిపోవడం వల్ల నష్టం వస్తోంది. ఈ 4మండలాల పరిధిలోని రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు సహకరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. భీమ్‌గల్ ప్రాంత రైతులు మాత్రం కాళేశ్వరం ప్యాకేజీ 21 ద్వారా కపల వాగులోకి ఎస్ఆర్ఎస్పీ నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. కప్పల వాగులోకి నీటిని మళ్లీచడంతో బోర్లలో నీటి మట్టాలు పెరుగుతాయని విన్నవిస్తున్నారు.

770 ఫీట్లు వేసినా చుక్క నీరు రాలే..

- శంకర్‌నాయక్, రైతు, కార్నర్ తండా, ధర్పల్లి

మూడెకరాల్లో వరి సాగుచేశా. మొదట నీళ్లకు సమస్య లేకున్నా భూగర్భజలాలు ఒకేసారి తగ్గడంతో బోరు తగ్గిపోయింది. పంటను కాపాడుకునేందుకు లక్షలు వెచ్చించి 770 ఫీట్లు బోరు వేసినా నీళ్లు రాలేదు. పంటను వదిలి వేశాం.

మూడు బోర్లు వేసినా ఫలితం లేదు..

- కుర్మ భీరయ్య, ఒన్నాజీపేట

నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశా. నాకున్న మూడుబోర్లలో రెండింటిలో నీరు తగ్గింది. మూడు కొత్త బోర్లు వేయగా రెండింట్లో నీరు పడలేదు. ఒకదాంట్లో కొంచెం వచ్చినా ఫలితం లేదు. బోర్లలో నీరు లేక పంటలను కాపాడలేకపోతున్నాం.

ప్రజాక్షేత్రంలో ప్రతిపక్ష పార్టీలను గౌరవించాలి

- టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బక్కాని నర్సింలు



మాట్లాడుతున్న టీడీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కాని నర్సింలు

సుభాష్‌నగర్, మార్చి9: ప్రజాక్షేత్రంలో ఉండే ప్రతిపక్ష పార్టీలను గౌరవిస్తూ అధికార పార్టీ ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, పొలిట్ బ్యూరో సభ్యులు బక్కాని నర్సింలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం కేవలం తెలుగుదేశం పార్టీతోనే కలిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని, పార్టీ కార్యకర్తలు సమన్వయంగా ఉండాలన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం గ్రామస్థాయి నుంచి ప్రతిష్టం చేయాలని అన్నారు. పార్టీ కార్యాలయం కోసం ఇచ్చిన స్థలం గురించి అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని ఆయన జిల్లా నాయకులకు హామీ ఇచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు దేగాం యాదగౌడ్, తుమ్మల ప్రసాద్, వినోద్‌కుమార్, రెంజర్ల సురేష్, హన్మంతరావు, జ్యోతి నారాయణ, దంతాల ఆనంద్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ పార్లమెంట్ టికెట్‌పై ఉత్కంఠ!

- నిజామాబాద్ పార్లమెంట్ టికెట్‌పై ఉత్కంఠ
- ఢిల్లీ పెద్దలను కలుస్తున్న ఆశావహులు
- బరిలో జీవన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, ఆకుల లలిత, ఈరవత్రి, అరికెల
- కరీంనగర్‌తోపాటుతో నిజామాబాద్ సీటుకు లింక్
- ఇప్పటికే నలుగురిని ప్రకటించిన అధిష్ఠానం
- రెండో జాబితా కోసం ఎదురుచూపు





నిజామాబాద్, మార్చి 9: (జిల్లా ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో ఉత్కంఠ వీడడం లేదు. తొలిజాబితాలోనే ఈ సీటుకు అభ్యర్థిని ప్రకటిస్తారని అంతా భావించినా రాష్ట్రస్థాయిలో వచ్చిన సామాజిక సమీకరణల వల్ల వాయిదా వేశారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి ఎంపికను బట్టి ఇక్కడి అభ్యర్థిత్వాన్ని నిర్ణయించనున్నారు. ఆ పార్లమెంట్‌కు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి టికెట్ ఇస్తే ఇక్కడ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి టికెట్ ఇవ్వనున్నారు. రాష్ట్రస్థాయిలో మొదటి జాబితాలోనే ఇద్దరు రెడ్డి సామాజిక అభ్యర్థులకు టికెట్ ఇవ్వడం వల్ల మిగతా 13 నియోజకవర్గాల పరిధిలో ప్రధాన వర్గాలకు అవకాశం ఇవ్వనున్నారు. రెండో జాబితాలో నిర్ణయం తీసుకుని నిజామాబాద్ అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ నేతల సమాచారం బట్టి తెలుస్తోంది. ఏఐసీసీ పెద్దలు పార్లమెంట్ సీటు అభ్యర్థి వాయిదావేయడంతో జిల్లాకు చెందిన పలువురు నేతల్లో ఆశలు చిగురించాయి. వీరు మళ్లీ తమ తమ ప్రయత్నాల్లో మునిగిపోయారు. పలువురు ఇప్పటికే ఢిల్లీ బాట పట్టారు.

● ప్రచారంలో పలువురి పేర్లు

నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఖరారు చేసినట్లు ప్రచారం జరిగింది. జిల్లాకు చెందిన సీనియర్ నేతలు కూడా ధృవపరిచారు. తొలి జాబితాలోనే ఆయన పేరు ఉంటుందని అంతా భావించారు. ఆయన కూడా జిల్లా పరిధిలో పలు కార్యక్రమాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ హోదాలో పాల్గొన్నారు. పార్టీకి చెందిన సీనియర్ నేతలతో మాట్లాడారు. ఢిల్లీ స్థాయిలో కూడా ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారుచేసినట్లు సమాచారం రావడంతో జిల్లాకు చెందిన ఇతర నేతలు, బీసీ సామాజికవర్గానికి చెందిన నేతలు కూడా ప్రయత్నాలు విరమించుకున్నారు. ఢిల్లీలో రాష్ట్రంలోని అన్నిపార్లమెంట్ నియోజకవర్గాల అభ్యర్థిత్వాలను పరిశీలించిన తర్వాత ఒకే వర్గానికి చెందిన వారికి ఎక్కువటికెట్లు ఇస్తే మిగతా పార్టీల నుంచి విమర్శలు వచ్చే అవకాశం ఉండటం వల్ల వాయిదా వేసినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ పరిధిలోని నిజామాబాద్‌కు చెందిన ఐదు నియోజకవర్గాలకు చెందిన కొందరు నేతలు ఈ జిల్లా వారికే టికెట్ ఇవ్వాలని ఏఐసీసీ నేతలకు, రాష్ట్ర ఇన్‌చార్జికి వివరించడంతో పార్టీ నేతలు వాయిదా వేసినట్లు తెలుస్తోంది. పార్లమెంట్‌లో 5 నియోజకవర్గాలు నిజామాబాద్ జిల్లాలో ఉండగా రెండు నియోజకవర్గాలు మాత్రమే జగిత్యాల జిల్లాలో ఉన్నాయి. ఒకవేళ జీవన్‌రెడ్డిని అభ్యర్థిగా నియమించినా బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు జిల్లాకు చెందిన వారు కావడంతో వారికే లాభిస్తుందని జిల్లాకు చెంది న కొందరు మంది నేతలు విన్నవించడంతో నిర్ణయాన్ని వాయిదావేసినట్లు తెలుస్తోంది. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా జీవన్‌రెడ్డిని ప్రకటిస్తే ఇక్కడ జిల్లాకు చెందిన వ్యక్తికి టికెట్ ఇచ్చే అవకాశం ఉంది. కరీంనగర్ టికెట్ కోసం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే జగపతిరావు కుమారుడు రాజేందర్ రావు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

● టికెట్ కోసం గట్టి ప్రయత్నాలు

నిజామాబాద్ జిల్లా నుంచి పార్లమెంట్ టికెట్ కోసం శాసనసభ ఎన్నికల్లో బాల్కొండ నుంచి పోటీచేసి ఓటమి చెందిన ముత్యాల సునీల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికల నర్సారెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనీల్‌లు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరు గతంలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలవడంతో పాటు ఢిల్లీ పెద్దలను కూడా కలిసివచ్చారు. ఏఐసీసీ నేతలను కలిసి పలుసార్లు వినతిపత్రాలు సైతం సమర్పించారు. తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించమని కోరారు.

● బీసీ వర్గానికే టికెట్ ?

కరీంనగర్ టికెట్ రెడ్డి సామాజిక వర్గానికి ఇస్తే నిజామాబాద్‌లో బీసీ సామాజిక వర్గానికి టికెట్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు పార్టీ నేతలు తెలిపారు. కరీంనగర్ టికెట్ వెలుమ సామాజిక వర్గానికి కేటాయిస్తే నిజామాబాద్ రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చే అవకాశం ఉంది. నిజామాబాద్‌తో పాటు ఇతర పార్లమెంట్ అభ్యర్థులను రెండో జాబితాలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నేతలు నిజామాబాద్ టికెట్‌ను తొలి జాబితాలో ప్రకటించకపోవడంతో ఇప్పటివరకు ప్రయత్నాలు చేసిన నేతలు మళ్లీ ఢిల్లీ పెద్దలను కలిసేందుకు సిద్ధమవుతున్నారు. చివరి ప్రయత్నాలు చేసి టికెట్ తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రెండో జాబితాలో ఏ వర్గానికి నిజామాబాద్ టికెట్ కేటాయిస్తారో తేలే అవకాశం ఉంది.

విషాదం

- వేర్వేరు ఘటనల్లో నీటిలో నలుగురి గల్లంతు
- ఎస్సారెస్పీలోని గోదావరిలో ఒకరు.. ఉమ్మెడ పాత గ్రామం శివారులోని గోదావరి నది నీటిలో మునిగి యువకుడి మృతి



గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు



నారాయణ (ఫైల్)

విష్ణువర్ధన్ (ఫైల్)

విజయ్ (ఫైల్)



మాధవ్ మృతదేహం

పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చి ఎస్సారెస్పీ లక్ష్మీకాలువ హెడ్‌రెగ్యులేటర్ వద్ద శుక్రవారం ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయిన ఘటన మరవక ముందే శనివారం మరో విషాదం చోటుచేసుకుంది. పోచంపాడ్‌లోని శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చి ఇద్దరు గల్లంతు కాగా, అందులో ఒకరి ప్రాణాలు దక్కగా మరో యువకుడు మృతిచెందాడు. ఉమ్మెడ పాత గ్రామం శివారులో ఉన్న గోదావరి నదిలో నీటిలో మునిగి మరో యువకుడు మృతిచెందాడు. వర్నిలోని అఫందీ ఫారంకు చెందిన యువకుడు ఈత కోసం నిజాంసాగర్ కాలువలోకి దిగి కొట్టుకుపోగా.. అతడిని కాపాడే క్రమంలో అతని నీటిలో దూకి మరో వ్యక్తి గల్లంతయ్యాడు. అలాగే చందూర్‌లో నిజాంసాగర్ కాలువలో నీటిని తోడేందుకు వేసిన విద్యుత్ మోటార్ ఫుట్‌బాల్ సరిచేసే యత్నంలో మరో వ్యక్తి విద్యుత్ షాక్ తగిలి నీటిలో జారి గల్లంతయ్యాడు.

● మేనల్లుడిని కాపాడి కొడుకును పోగొట్టుకొన్న తండ్రి

మెండోర, మార్చి9: మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి ఎక్స్‌రోడ్ గ్రామానికి చెందిన మక్కలరెడ్డి తన కుటుంబ సభ్యులతో ఎస్సారెస్పీలోని మొదటి పుష్కరఘాట్ వద్దకు చేరుకున్నారు. మక్కలరెడ్డి, కుమారుడు మక్కల మహేష్, మేనల్లుడు దండుగుల శ్రీనివాస్ స్నానం చేసేందుకు గోదావరిలోకి దిగారు. కొద్దిసేపటికి నీటి ప్రవాహంలో మక్కల రెడ్డి కళ్ల ముందే మేనల్లుడు దండుగుల శ్రీనివాస్, కొడుకు మక్కల మహేష్ కొట్టుకుపోతుండడంతో మొదట మేనల్లుడు దండుగుల శ్రీనివాస్‌ని కాపాడి ఒడ్డుకు చేర్చాడు. వెంటనే కొడుకు మక్కల శ్రీనివాస్‌ను కాపాడే ప్రయత్నం చేస్తుండగానే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. కళ్లముందే కన్న కొడుకు ప్రాణాలు కోల్పోవడంతో తండ్రి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీనివాస్‌యాదవ్ గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టంకు తరలించారు.

● వర్ని, చందూర్ మండలాల్లో ముగ్గురు..

వర్ని: వర్ని, చందూర్ మండలాల పరిధిలో శనివారం జరిగిన వేర్వేరు చోట్ల కాలువలో దిగిన ముగ్గురు గల్లంతయ్యారు. జిల్లాలోని వర్ని మండలం అఫందీ ఫారం గ్రామానికి చెందిన మోచి నారాయణ (20) ఈత కోసం నిజాంసాగర్ కాలువలోకి దిగాడు. నీటి ప్రవాహానికి నీటిలో కొట్టుకుపోతున్న నారాయణను పెద్దనాన్న మోచి విజయ్ (50) కాపాడేందుకు కాలువలోకి దూకాడు. దీంతో నీటి ఉధృతి తీవ్రం కావడంతో ఇరువురు గల్లంతయ్యారు. ఈ ఘటనను చూసిన స్థానికులు వారిని వెతికేందుకు గాలింపుచర్యలు చేపట్టారు. అలాగే చందూర్ మండల శివారులో మొండి విష్ణువర్ధన్ (25) స్నేహితులతో కలిసి నిజాంసాగర్ కాలువలో నీటిని తోడేందుకు వేసిన విద్యుత్ మోటార్ ఫుట్‌బాల్ సరిచేసే యత్నంలో విద్యుత్ షాక్ రావడంతో నీటిలోకి జారి గల్లంతయ్యాడు. దీంతో మిగతా వారు ఊళ్లోకి వెళ్లి సమాచారం అందించారు. బాధిత కుటుంబాల వారు అందించిన సమాచారం మేరకు వర్ని ఎస్ఐ కృష్ణ కుమార్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. తమకు ముగ్గురు వ్యక్తులు గల్లంతు అయినట్లు ఫిర్యాదు అందిందని వారి సమాచారం మేరకు స్థానికుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిజాంసాగర్ నీటి ఉధృతి తీవ్రంగా ఉండటంతో గల్లంతయిన వారు ఆదివారం లభ్యమయ్యే అవకాశం ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి నీటి ప్రవాహాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

● ఉమ్మెడ పాత గ్రామ శివారులోని గోదావరిలో ఒకరు..

నందిపేట, మార్చి9: మండలంలోని ఉమ్మెడ పాత గ్రామం శివారులో ఉన్న గోదావరి నదిలో నీట మునిగి కొండబోయిన మాదవ్ (30) అనే యువకుడు మృతిచెందినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. లోకేశ్వర్ మండలం వట్టోలి గ్రామంలో మేస్త్రీ పని చేస్తున్న మాదవ్ తన స్నేహితుడితో కలిసి ఉమా మహేశ్వర ఆలయంలో జరిగే అన్న సత్రంకు వచ్చారు. కాల కృత్యాలు, కాళ్ళు కడుక్కోవడానికి వెళ్లిన మాదవ్ కాలుజారీ నదిలో కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న గజ ఈతగాళ్లు కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే మృతిచెందినట్లు పోలీసులు చెప్పారు. మృతుడి మృతుడి స్వస్థలం నెల్లూరు జిల్లా కలిగిరి మండల కేంద్రంగా గుర్తించామని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై రాహుల్ వెల్లడించారు.

పడిలేచిన మర్రిచెట్టు వద్ద ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పూజలు

ముప్కాల్, మార్చి9: మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు వద్ద బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు వద్ద బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శివలింగానికి దర్శించు కొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి ఆలయ పురోహితు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కాంగ్రెస్ నాయకులు సుదర్శన్‌రెడ్డికి శాలువతో సన్మానించి మెమోంటోను అందజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గడుగు గంగాధర్, మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ముప్కాల్ పడిలేచిన మర్రిచెట్టు వద్ద పూజలు

ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు

● నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, మార్చి9: ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పడకల్ గ్రామంలో శివాలయం, రామాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈనెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎం.సాయిరెడ్డి, మాజీసర్పంచ్‌లు ఎం.చిన్నసాయిరెడ్డి, మండల కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం, అరుణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందల్‌వాయి: రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి సొసైటీ వైస్ చైర్మన్ మారుతి చేరారు. ఇందల్‌వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ మారుతి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయనను ఎమ్మెల్యే భూపతిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్ సుధాకర్,తదితరులు ఉన్నారు.

అంత్యక్రియాల్లో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే

జక్రాన్‌పల్లి: శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు ఎస్సారెస్పీ లక్ష్మీకాలువ హెడ్‌రెగ్యులేటర్ వద్ద జలశయంలో మహాశివరాత్రి సందర్భంగా దైవదర్శనానికి వెళ్ళి స్నానం చేసేందుకు దిగి మండలంలోని గన్యాతాండా గ్రామానికి చెందిన అజ్మీర సాయికిరణ్, అజ్మీర సాయినాథ్, బనవత్ లోకేష్ నీట మునిగి మృతి చెందగా శనివారం జరిగిన వీరి అంత్యక్రియాల్లో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పాల్గొన్నారు.



పడకల్ శివాలయంలో పూజలు చేస్తున్న నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే

బీజేపీ ఆధ్వర్యంలో నినాదాల ప్రదర్శన

రుద్రూరు, మార్చి 9: మళ్లీ మోదీ సర్కార్ రావాలంటూ, నేను మోదీజీ కుటుంబ సభ్యుడిని అంటూ నినాదాలు చేస్తూ మండలంలోని రుద్రూరులో ప్రదర్శన చేశారు. శనివారం పార్టీ మండల అధ్యక్షుడు హరికృష్ణ ఆధ్వర్యంలో నినాదాలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో సారి మోదీ ప్రభుత్వం వచ్చినప్పుడే దేశం సస్యశ్యామలంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అందరినీ ఆదుకునేందు కోసం మోదీ సర్కార్ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏముల గజేందర్, వడ్ల సాయినాథ్, కుమ్మరి గణేష్, సంజీవ్, యాదగిరిలు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణం కార్యరూపం దాల్చేనా?

● ఎస్ఎస్ఏ రోడ్డు నుంచి లింగంపల్లి వరకు ● ఆరేడు జడ్పీ రోడ్డు నుంచి మర్పల్లి వరకు బీటీ రోడ్ల నిర్మాణం ● గత ప్రభుత్వం రూ.6.70 కోట్లు మంజూరు చేశారు


ఎస్ఎస్ఏ రోడ్డు నుంచి అచ్చంపేటకు వెళ్లే రహదారి ఇదే


ఆరేడు జిల్లా పరిషత్ రహదారి నుంచి మర్పల్లికి వెళ్లే రహదారి ఇదే


అచ్చంపేట రోడ్డు నుంచి మర్పల్లికి వెళ్లే రహదారి ఇలా

నిజాంసాగర్, మార్చి 9: ఎన్నో ఏళ్లుగా ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూసిన కల నెరవేరినట్లే అనిపించి, తిరిగి పాత బాటే పట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరుచేశారు. ఈ రహదారి నిర్మాణానికి సెప్టెంబరులో శంకుస్థాపన చేశారు. మొదటి దఫా టెండర్లు పిలిచారు. ఆయా గ్రామాల రహ దారులు బీటీ రోడ్లుగా మారుతాయని ఎదురు చూస్తున్నారు. రూ.6కోట్ల 70 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేయగా, సెప్టెంబరులో నిర్మాణం పనులకు అప్పటి ఎమ్మెల్యే హన్మంత్ షిండేతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫెదార్ శోభ రాజు శంకుస్థాపనలు చేశారు.వివరాల్లోకి వెళితే నిజాంసాగర్ మండలం ఎస్ఎస్ఏ రహదారి నుంచి లింగంపల్లి వరకు రూ. 4 కోట్లతో బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. ఆరేడు జిల్లా పరిషత్ రహదారి నుంచిబ్రాహ్మణ్‌పల్లి మీదుగా మర్పల్లి వరకు రోడ్డు పనులు నిర్మాణం పనులు చేపట్టేందుకు రూ.2 కోట్ల 70 లక్షల మంజూరు చేశారు. ఈ నిధులతో ఎన్నో రోజులుగా రహదారి నిర్మాణాలకు నోచుకోని బ్రాహ్మణపల్లి, మర్పల్లి, అచ్చంపేట, లింగంపల్లి గ్రామాల రహదారులకు మహార్దశ వస్తోందని ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. సెప్టెంబరు నెలలో బీటి రోడ్డు నిర్మాణం పనులకు పంచాయతీ రాజ్ శాఖ మొదటి దఫా టెండర్లను పిలిచినప్పటికి ఏ ఒక్కరూ కూడా టెండర్లలో పాల్గొనలేక పోయారు. దీంతో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పంచాయతీరాజ్ అధికారులు మరో దఫా రహదారి నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయకపోయారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 6 కోట్ల 70 లక్షలను స్టేట్ ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరుచేశారు. ఈ నిధులతో రహదారి నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన రహదారి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఎస్‌డీఎఫ్ నిధులు రద్దు చేశారా? ఈనిధులతో కొత్తగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారా?అంతు చిక్కడం లేదు. 40 ఏళ్లుగా రహదారి వెంట వెళ్లే ప్రజలు, రైతులు నరక యాతన పడుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఈ రహదారిని 2023 వరకు పట్టించుకునే పాపాన లేకపోవడంతో, అప్పటి ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణాలు చేపడతామనే తరుణంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాలేక పోయింది. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రూ. 6 కోట్ల 70 లక్షలను కేటాయించేనా? ఈ రహదారి పనులకు శ్రీకారం చుట్టేనా? అని గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా పెట్టుకుని ప్రజా ప్రతినిధులు రహదారి పనులకు శ్రీకారం చుట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా శివ పార్వతుల కల్యాణోత్సవం


మానాలలో శివ పార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కమ్మర్‌పల్లి, మార్చి 9: బాల్కొండ నియోజికవర్గం పరిధిలోని రాజన్నసిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలం మారుమూల గ్రామం మానాలలో కొలువుదీరి ఉన్న శంబులింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదిన ఉత్సవాల్లో భాగంగా శనివారం శివ పార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా ఘనంగా నిర్వహించారు. ఆలయఅర్చకులు మధుపూర్ణచందు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మూడారపు గంగారెడ్డి వీడీసీ చైర్మన్ గోపిడి రవీందర్‌రెడ్డి, కమిటీ పాలకవర్గ సభ్యులు స్వామివారి కల్యాణోత్సవ సందర్భంగా పట్టువస్త్రాలను సమర్పించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన పలువురు దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ఆలయావరణలో అన్నదాన కార్యక్రమంలో గ్రామస్థులు, గిరిజనులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండలవైస్ ఎంపీపీ పిసరి భూమయ్య మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు వీడీసీ ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజ, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులంతా కలిసి మెలిసి ఉండాలి

● పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్

డిచ్‌పల్లి, మార్చి 9: వసతి గృహల్లో విద్యార్థులు జూనియర్, సీనియర్ అని భేదాభిపాయాలు లేకుండా కలిసి మెలిసి ఉండాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. ఇటీవల బోధన్ బీసీ హాస్టల్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఉన్న హాస్టళ్లలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి పలు సూచనాలు చేశారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, అక్షయ్, వరుణ్, సాయి, పాల్గొన్నారు.

టీయూలో ఎస్ఎఫ్ఐ దిష్టిబొమ్మ దహనం

డిచ్‌పల్లి, మార్చి 9: తెలంగాణ యూనివర్సిటీ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో శనివారం వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడతూ.. ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజు సందర్భంగా కేరళ విద్యార్థిని సీనియర్‌లతో కలిసి డ్యాన్స్ చేసినందుకు కేరళలోని పోకోడ్ కేరళ వెటర్నరీ అండ్ ఎనిమల్ హస్‌బెండరీ యూనివర్సిటీ 2వ సంవత్సరం విద్యార్థి సిద్ధార్థ హత్యకు కారణమైన ఎస్ఎఫ్ఐ నాయకులను శిక్షించాలని డిమాండ్ చేశారు.కేరళ అధికార పార్టీ అయిన సీపీఐ (ఎం) విద్యార్థి సంస్థ స్టూడెంట్ ఫెడరేషన్‌ఆఫ్ ఇండియా ఆఫీస్ బేరర్లు దీని కారణంగా నిందితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మెతక వైఖరికి నిరసన చేయడం సరికాదని నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈనిరసన కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ నాయకులునాగరాజు, నాయకులు నాగరాజు, ఉపాధ్యక్షుడు అనిల్, తరుణ్, ప్రమోద్, మహేశ్, సాయికృష్ణ, పాల్గొన్నారు.

జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా సురేష్ షెట్కర్ ఎంపికపై హర్షం

కోటగిరి,మార్చి9: జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సురేష్ షెట్కార్‌ను ఎంపిక చేయడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కోటగిరి మండల కేంద్రంలో శనివారం సంబరాలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కొట్టం మనోహర్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం సురేష్ షెట్కర్‌ను ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేయడం అభినందనీయమన్నారు. పార్టీ నమ్ముకుని కష్టపడి పని చేసే నాయకులకు అధిష్ఠానం తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. గతంలో జహీరాబాద్ ఎంపీగా సురేష్ షెట్కర్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, ఈ ఎన్నికలలో ఆయనను భారీ మెజారిటీతో గెలిపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షహీద్ హుస్సేన్, గంగాధర్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు:మండల కేంద్రంలో జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా సురేష్‌కుమార్ షెట్కార్‌కు టికెట్ కేటాయించడంతో మండల అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్, గ్రామఅధ్యక్షుడు పార్వతి ప్రవీణ్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు బాణాసంచాలు కాల్చి స్వీట్లను పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్ మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్‌కుమార్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నడిపింటి నగేష్, కిసాన్ కేత్ మండల అధ్యక్షుడు అడప సాయిలు, ఎంపీటీసీ గౌస్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు కర్కే అశోక్, వార్డుమెంబర్ నిస్సార్, మాశెట్టి శ్రీనివాస్, గంగాధర్, దువ్వ రవి, సీనియర్ నాయకులు గోపాల్ రావు, దత్తు, తదిత రులు పాల్గొన్నారు

మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

పెద్దబజార్, మార్చి 9:మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని సీఐటీయూ కార్యలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని అన్నారు. కార్పోరేట్ సంస్థల ప్రయోజనాల కోసం మతోన్మాదా విధానాలను వేగవంతం చేస్తుందన్నారు. శ్రమను, శ్రమ చేసే మహిళలను గౌరవించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ హక్కుల మానవ హక్కుల్లో భాగంగా కాని బీజేపీ ప్రభుత్వ మహిళల హక్కులను హరిస్తోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, స్వర్ణ, సుకన్య, రేవతి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నవీపేట,మార్చి9: మండలంలోని జన్నేపల్లిలో ఈ నెల 7న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కంచర్ల రమేష్(38)అనే మేస్త్రీ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆత్మకూర్ మండలం మల్ల కాలువ గ్రామానికి చెందిన రమేష్ నెల రోజుల క్రితం గ్రామంలో మేస్త్రీ పని చేయడానికి స్థానిక రంగస్వామి అనే మేస్త్రీ వద్ద పనికి కుదిరాడు. ఇటీవల స్వగ్రామానికి వెళ్లిన ఆయన ఈ నెల 7న జన్నేపల్లికి వచ్చి బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్ వాహనం ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారని ఆయన పేర్కొన్నారు. పెద్ద మేస్త్రీ రంగస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రమేష్ మృతదేహన్ని పోస్టుమార్టం అనంతరం అతని స్వగ్రామానికి తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

కామ్రేడ్ రవి ఆశయ సాధన కోసం పోరాడుదాం

సిరికొండ మార్చి 9 : గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోదుడు కామ్రేడ్ రాయల రవి ఆశయ సాధన కోసం పోరాడుదామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఐఎంఎల్ కేంద్ర కమిటి సభ్యులు రాష్ట్ర కార్యదర్శి రాయల రవి 8 వర్ధంతి సందర్భంగా సిరికొండ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి రాష్ట్ర నాయకులు రామకృష్ణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఏ లక్ష్యం కోసమైతే పోరాడడాడో ఆ లక్ష్య సాధన కోసం మనమందరం ఉద్యమిద్దామన్నారు.జనతా ప్రజాతంత్ర్య విప్లవ సాధన కోసం పనిచేయడమే ఆయనకు నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందన్నారు.కామ్రేడ్ రవన్న 40 ఏళ్ల ప్రజల హక్కుల సాధన కోసం అజ్ఞాత జీవితం గడిపాడని ఆయన వివరించారు.అడవీ , మైదాన ప్రాంత ఉద్యమాలను సమన్వయం పరుస్తూ పేద ప్రజలను దోపిడి, పీడనల నుండి విముక్తి కోసం తన రక్తాన్ని దారపోసిన గొప్ప పోరాట యోదుడని రామకృష్ణ కొనియాడారు.పెట్టుబడి దారులు కార్మిక వర్గా శ్రమను ఏవిదంగా దోపిడి చేస్తున్నారో కార్మికులకు వివరించి ఉద్యమాల వైపు నడిపించిన విధానం గొప్పదన్నారు. అందుకని సమిష్టి పోరాటాలను చేస్తు రవి ఆశయాల సాదన కోసం ఉద్యమించాలని అప్పుడే రవన్న ఆశయ సాధన కోసం పనిచేసిన వారమవుతామని రామకృష్ణ అన్నారు. ఈ సమావేశంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షులు అనీస్,రమేష్,దామోదర్,లింబాద్రి,సాయరెడ్డి, రమేష్,సాయిలు,రాజ్‌కిషోర్,నరేష్,బబ్లూ,రామన్న,నాగన్న,బాబురావు తదితరులు పాల్గోన్నారు.

బోధన్‌రూరల్: విప్లవ ప్రతిఘటన పోరాట యోధుడు కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ 8వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని తట్టికోటలో సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా పంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ తన విద్యార్థి దశ నుంచి తుది శ్వాస వరకు ప్రతి ఘటన పోరాట యోధుడిగా పని చేశారని ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పడాల శంకర్, ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు నాగమణి, జి.సీతారాం, సీహెచ్ గంగారాం, పోశెట్టి, శంకర్, రాజు, సుశీల, శంకర్, అరుణ, సలీం, మహేష్, రమేష్ తదితరులు ఉన్నారు.


రవి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాస్‌లైన్ నాయకులు

మోర్తాడ్: గోదావరి లోయ ప్రతిఘటన యోధుడు కామ్రేడ్ రవన్నకు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. మండల కేంద్రంలో రవన్న అలియస్ రాయల్ సుభాష్‌చంద్రబోస్ 8వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ నాయకులు కిషన్ మాట్లాడుతూ ఆదివాసుల విముక్తి కోసం వారికి భూమి హక్కు కల్పించడానికి 40ఏళ్ల అజ్ఞాత జీవితంలో అనేక పోరాటాలు నిర్వహించిన గొప్ప విప్లవ యోదుడు అని కొనియాడారు. ఈ కార్యక్ర మంలో మండల నాయకులు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెద్దబజార్:ప్రజాతంత్ర విప్లవ యోధుడు రాయలసుభాష్‌చంద్రబోస్ అని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ అన్నారు. నగరంలోని కోటగల్లీలో గల ఎన్ఆర్‌భవన్‌లో శనివారం భారత విప్లవ పోరాట యోధుడు రాయలసుభాష్‌చంద్రబోస్ 8వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆదాని, అంబానీలాంటి కొద్ది మంది కార్పేరేట్ సంస్థల అమెరికాలాంటి సామ్రాజ్యవాదుల బడా పెట్టుబడి ఫైనాన్స్ క్యాపిటల్‌తో మోడి, షా పాలన దేశంలో ఫాషిజాన్ని ఆజ్యం పోస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ నాయకులు యాదగిరి, వెంకన్న, రాజేశ్వర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ ఆధ్వర్యంలో శనివారం కామ్రేడ్ రవన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐఎంల్ మాస్‌లైన్ ప్రజాపంథ డివిజన్ కార్యదర్శి దేవరాం మాట్లాడుతూ గోదావరి లోయ ప్రతిఘటన యోధుడు కామ్రేడ్ రవన్న అని ఆయన ఆశయం సాధించిన నాడే ఘనమైన నివాళి అర్పించినట్టు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు ఎస్.ముత్తెన్న, డివిజన్ నాయకులు ఆకుల గంగారాం, రాజన్న, రఘుర్, శేఖర్, నరేంధర్, నజీర్, పీడీఎస్‌యు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: కామ్రేడ్ రవన్నను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు పార్వతి రాజేశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని బోర్గాం గ్రామంలో కామ్రేడ్ రవన్న 8వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుట్టి నాగన్న, ఒడ్డెన్న, నసీర్, పోశెట్టి, రవి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథ) కార్యకర్తలు ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యలపై పోరాడి సాధించుకున్న రోజునే సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్రకమిటీ సభ్యులు రాష్ట్రకార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్(రవి)కి నిజమైన నివాళిఅని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథ) జిల్లా నాయకుడు సారాసురేష్ అన్నారు.శుక్రవారం పార్టీ కార్యాలయంలో రాయలసుహాష్ చంద్రబోస్ 8వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలువేసి నివాళులర్పించి రెండు నిముషాలు మైనం పాటించారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి కమిటీ కార్యదర్శి అశోక్, ఆర్మూర్ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జన్నెపల్లిలో రెండు బైక్‌ల ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

నవీపేట,మార్చి9: మండలంలోని జన్నెపల్లిలో శనివారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జన్నెపల్లికి చెందిన రచ్చ నవీన్, అతని భార్య లయతో పాటు నవీన్ మేన కోడలైన 8 సంవత్సరాల చికితతో కలిసి స్థానిక శివాలయానికి బైక్‌పై వెళ్లారు. తిరిగి బైక్‌పై ఇంటికి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో బైక్ ఢీకొనడంతో ముందు బైక్‌పై ఉన్న నవీన్ కాలికి తీవ్ర గాయాలు కాగా అతని మేన కోడలైన చికిత తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితులను ప్రైవేటు వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాదంలో నవీన్ భార్య లయకు స్వల్ప గాయాలయ్యాయి. వెనుక నుంచి బైక్‌పై వచ్చి ఢీకొట్టిన ఇద్దరు యువకులు మండలంలోని యంచకు చెందిన వారుగా స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్ఐ యాదగిరి గౌడ్‌ను వివరణ కోరగా జన్నెపల్లిలో రెండు బైక్‌లు ఢీకొన్న మాట నిజమేనని ఈ విషయంపై శనివారం సాయంత్రం వరకు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేయాలి

నిజామాబాద్‌అర్బన్, మార్చి 9: బీసీ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేయాలని, అన్ని శాఖల్లో సభ్యత్వం నమోదు చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరాలసుధాకర్ అన్నారు. శనివారం నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కరిపే రవీందర్ అధ్యక్షతన జరిగింది. బీసీ ఉద్యోగుల సంఘాన్ని జిల్లాలో మరింత బలోపేతం చేయాలన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావ్ ఉద్యోగులను కించపరుస్తు మాట్లాడడం సరికాదని దానిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సలహదారులు ఆకుల ప్రసాద్, చంద్ర మోహన్, ప్రభాకర్, దేవేందర్, పాల్గొన్నారు.

సాలూరలో హోరా హోరీగా కుస్తీ పోటీలు

బోధన్ రూరల్, మార్చి9: సాలూర మండల కేంద్రంలో శనివారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించగా హోరాహోరీగా కొనసాగాయి. కుస్తీ పోటీలలో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు నగదును అందజేశారు. కుస్తీ పోటీలను తిలకించడానికి సాలూరతో పాటు చుట్టూ పక్కల గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుస్తీ పోటీలలో బోధన్ చుట్టూ పక్కల ప్రాంతాల నుంచే కాక మహారాష్ట్ర, కర్నాటకల నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. కుస్తీ పోటీలు హోరా హోరీగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, గ్రామ పెద్దలు అల్లె రమేష్, శివాలయం కమిటీ అధ్యక్షుడు దడేన్ శంకర్, నగేష్ పటేల్, నాగేష్, గంగయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో

రుద్రూరు: రుద్రూరు మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామంలో శనివారం కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కి.శే. కిషన్‌రావు పటేల్ స్మారకార్థం కుస్తీ పోటీలను నిర్వహించామని వారి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కుస్తీ పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని జన్నేపల్లిలో శనివారం కుస్తీపోటీలు నిర్వహించారు. స్థానిక చారిత్రక శివాలయంలో జరిగిన మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండో రోజైన శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన కుస్తీపోటీలలో జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున మల్లయోధులు కుస్తీపోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


జన్నేపల్లిలో జరిగిన కుస్తీపోటీలలో పాల్గొన్న మల్లయోధులు

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్,మార్చి9: నేడు నగరంలోని సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగరటౌన్-2 ఏడీఈ తోట రాజశేఖర్ తెలిపారు. నగరంలోని సుభాష్‌నగర్, అయ్యప్ప టెంపుల్ ఏరియా, తదితర ఏరియాల్లో ఉదయం 10గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జిల్లా ప్రధాన న్యాయాధికారికి ప్రశంసా పత్రం



ప్రశంసా పత్రం అందుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి

నిజామాబాద్ లీగల్, మార్చి 9: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యాయ విజ్ఞాన సదస్సులు సామాజిక చైతన్య కార్యక్రమాలకు చేయూతనందజేస్తున్నాయని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జస్టిస్ సాంకోశి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ తుకారాం అన్నారు. మార్చి 3న 11వేల మంది బాలికలు మహిళలతో తైక్వాండో, మహిళలకు ఆత్మరక్షణలో శిక్షణ కార్యక్రమం ప్రదర్శించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సంపాదించుకోవడం న్యాయసేవా సంస్థ చరిత్రలోనే ప్రముఖ ఘట్టంగా నిలిచిపోయిందని పేర్కొంటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రధాన న్యాయాధికారి సునీత కుంచాలకు హైకోర్టు జస్టిస్‌లు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ విధంగా పలు కార్యక్రమాలకు కూడా ముందంజ చూపాలని రాష్ట్ర న్యాయసేవా సంస్థ ఎల్లవేళల తమ సహాయ సహకాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారిని పద్మావతి, సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్, సంస్థ సిబ్బంది సుమలత, నాగేందర్, భరత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో మహిళ ప్రసవం



108అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

ముప్కాల్, మార్చి9: మెండోర మండల కేంద్రానికి చెందిన జాదవ్‌ప్రియంక పురిట నొప్పులతో 108వాహనంలో ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గ మధ్యలో ప్రసవించింది. శనివారం మెండోర నుంచి 108అంబులెన్స్‌లో మహిళను ఆసుపత్రికి తీసుకువెళ్తుంగా మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నట్టు 108అంబులెన్స్ సిబ్బంది శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా 108సిబ్బందిని పలువురు అభినందించారు.

మహిళలు తమ ఆత్మ రక్షణకు కరాటే

బోధన్ రూరల్, మార్చి 9: మహిళల తమ ఆత్మ రక్షణకు కరాటే ఎంత గానో దోహదపడుతుందని కరాటే మాస్టర్ ఖయ్యూం అన్నారు. శనివారం ఒకినోవా స్కూల్ ఆఫ్ మార్షల్ ఆర్ట్ ఆధ్వర్యంలో సాలూర , బోధన్, బిలోలి, మండలాలకు చెందిన కరాటే ప్రతిభావంతులకు వారి ప్రతిభను బట్టి బెల్టులను ప్రధానం చేశారు. మహారాష్ట్రలోని సన్‌షైన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కరాటే మాస్టర్లు ఖయ్యూం, పల్లవిలు విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేశారు. సాలూర మండలానికి చెందిన రుచిత, సాకేత్, భవ్యశ్రీ, జశ్వంత్‌గౌడ్, శైలజకు ఎల్లో బెల్టు, తేజస్విని, నితిన్‌లకు ఆరెంజ్ బెల్టులను, బోధన్ పట్టణానికి చెందిన సుభిక్షకు గ్రీన్ బెల్టు, శుభమ్‌కు బ్రౌన్ బెల్టు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ సచిన్, గ్రామస్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

మాక్లూర్, మార్చి9: మండల కేంద్రంలోని మాక్లూర్ గ్రామంలో శనివారం అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను పట్టుకున్నామని ఎస్సై సుదీర్‌రావు తెలిపారు. గ్రామానికి చెందిన మోబిన్ అనే వ్యక్తి సుమారు 20క్వింటాళ్ళ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్‌సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు

సుభాష్‌నగర్, మార్చి9: ఆర్టీసీ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం ఫిట్‌మెంట్, పీఆర్‌సీ ప్రకటించడంతో ఆర్టీసీ ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డిపో-1 కార్యాలయంలో ఉద్యోగులు టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. కార్మికులందరికి 21శాతం ఫిట్‌మెంట్, పీఆర్‌సీని ప్రకటించడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ట్రాన్స్‌పోర్టు మినిస్టర్ పొన్నం ప్రభాకర్, ఎండీ సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని ఏళ్ల నుంచి పీఆర్‌సీ పెండింగ్‌లో ఉందని రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సీ ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో-1 మేనేజర్ ఆనంద్, ఆర్టీసీ ఉద్యోగులు, యూనియన్ నాయకులు వి.మురళీధర్,వందేమాతరం శ్రీనివాస్, నర్సయ్య, చందర్, తదితరులు పాల్గొన్నారు.



ఆనందతో టపాసులు కాల్చుతున్న ఆర్టీసీ కార్మికులు

జిల్లా అంతటా శివాలయాల్లో అన్నదానాలు



వెంకటాపూర్ అన్నదానం పాల్గొన్న జడ్పీచైర్మన్



శివాలయ రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



నందిపేటలో భక్తులకు సందేశమిస్తున్న ఎంపీ అర్వింద్

మాక్లూర్, మార్చి9: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో శనివారం ఆలయాల్లో అన్నదానంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉపవాస దీక్షల సందర్భంగా మండలంలోని అయా గ్రామాలలోని ఆలయాలలో నిర్వాహకులు అన్నదానం నిర్వహించగా భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఠల్‌రావు మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని అన్నారు.

డొంకేశ్వర్: మండల వ్యాప్తంగా శివాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. పండగ సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు శనివారం తెల్లవారు జామున నుంచి ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. డొంకేశ్వర్, నూత్‌పల్లి, నడ్కుడ, గాదేపల్లి, అన్నారం గ్రామాలలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నదానంలో భక్తులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొని దీక్షలు విరమించారు.

నిజామాబాద్‌అర్బన్: మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలు విరమించేందుకు నగరంలోని అన్ని శివాలయాల్లో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నగరంలోని నీలకంఠేశ్వరాలయం, శంభునిగుడి, ఉమామహేశ్వరాలయం, నందిగుట్ట, మార్కెండయ మందిరం, శివాలయాల్లో ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేయగా భక్తులు తరలి ఉపవాస దీక్షలను విరమించారు.

బోధన్ రూరల్: బోధన్ పట్టణంలోని కార్తీక లింగేశ్వర ఆలయం, ఓంకారేశ్వర ఆలయాల్లో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బోధన్ మున్సిపల్ ఛైర్ పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె వెంట పిట్ల సత్యం, శ్రీకాంత్‌గౌడ్‌లతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలి

బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం ఆలయ ఆచారం ప్రకారం రథోత్సవంలో విగ్రహామూర్తులను ఊరేగింపు నిర్వహించారు. రథోత్సవానికి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవాన్ని ఆలయం చుట్టూ తిప్పుతూ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పట్టణ సీఐ వీరయ్య ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్ పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ కర్ని హనుమంతరావు, దేవాదాయ శాఖ అధికారి రవీందర్ గుప్త, కౌన్సిలర్లు రాములు, శ్రీకాంత్‌గౌడ్, శరత్‌రెడ్డి, వేద పండితులు గణేష్ మహరాజ్, మహేష్ పంతులు, భక్తులు పాల్గొన్నారు.

ఇందల్‌వాయి: మండలంలోని గన్నారం, సిర్నాపల్లి, తిర్మన్‌పల్లి, గ్రామాల్లో మాహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఆయా గ్రామాల వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రెంజల్: రెంజల్ మండలంలోని గ్రామాల్లో మహ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి.శనివారం ఉపవాస దీక్షలు ముగించేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని శివలింగానికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉపవాస దీక్షలు ముగించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ధర్పల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో శివాయాలలో శనివారం భక్తులతో కిటకిటలాడాయి. శివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన సందర్భంగా భక్తులు శివాలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, బాబు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆలయాల్లో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఉపవాసం ఉండి జాగరణ చేసి భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: నూత్‌పల్లి గ్రామంలో పాత శివాలయంలో శివరాత్రి పర్వదినం భక్తులు, ప్రజలు ఉపవాస దీక్షలతో శివ లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం పాత శివాలయంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు, మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి, పోతంగల్ మండలాల్లో శనివారం మహ శివరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి. శుక్రవారం కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు శనివారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అనంత విఠల్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.

వర్ని: వర్ని, చందూర్ మండలాల పరిధిలో శనివారం మహ శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. చందూర్ మండల కేంద్రంలో శివ పూజలు చేసి భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు.గణపతి, నవీన్, రెడ్డి రాంబాబు, రెడ్డి చౌదరి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

రుద్రూరు: మహాశివరాత్రి సందర్భంగా రుద్రూరు మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉపవాస దీక్షలను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి, మహిళలు, భక్తులుపాల్గొన్నారు.

నందిపేట: మండల కేంద్రంలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమం, శ్రీ నందికేశ్వర ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. మహ శివరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం పలుగుట్టపై జాతర జరిగింది. వేల సంఖ్యలో భక్తులు బారులు తీరారు. శివాలయం, సాయిబాబ మందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహరాజ్ ప్రతీ ఒక్కరికీ విభూది పెట్టి ఆశీర్వాదించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహరాష్ట్ర, కర్నాటక, డిల్లీ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు జాతరకు వచ్చారు. స్థానిక ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వాలింటర్లుగా పని చేశారు. ఎస్ఐ జి రాహుల్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నందిపేటకు ప్రజా ప్రతినిధుల తాకిడి

మండల కేంద్రంలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమంతో పాటు గోదావరి నది ఒడ్డున ఉన్న పాత ఉమ్మెడ శివారులోని శ్రీ ఉమా మహేశ్వర ఆలయం వద్ద పెద్ద ఎత్తున్న శివ రాత్రి తరువాత రోజున జాతర ఉత్సవాలు పెద్ద ఎత్తున జరుగుతాయి.ఇందులో భాగంగా ఆలయాలకు ప్రజా ప్రతినిధుల తాకిడి ఎక్కువైంది. నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అర్వింద్, జిల్లా పరిషత్ ఛైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మహిళా కార్పోరేష్ మాజీ ఛైర్మన్ ఆకుల లలిత వేర్వేరుగా ప్రత్యేక పూజలు చేశారు. నందిపేట శ్రీ కేదారేశ్వర ఆశ్రమం వ్యవస్థాపకులు శ్రీ మంగి రాములు మహరాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. ఉమ్మెడలోని ఉమామహేశ్వర ఆలయానికి వెళ్ళిన ప్రజా ప్రతినిధులకు గ్రామస్తులు ఘనంగా స్వాతగం పలికారు. స్వయంభూలింగం పూజలు, అభిషేకాల అనంతరం గ్రామస్తులు ప్రజా ప్రతినిధులకు జ్ఞాపికలను అందజేశారు.

జక్రాన్‌పల్లి: మహాశివరాత్రి ఉత్సవాలను ప్రజలు, భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శనివారం మండలంలోని కలిగోట్ గ్రామంలో గల పుట్ట శివాలయంలో, జక్రాన్‌పల్లి, అర్గుల్, సికింద్రాపూర్, బ్రహ్మణ్‌పల్లి, తొర్లికొండ, కొలిప్యాక్, మనోహరాబాద్, కేశ్‌పల్లి, నారాయణపేట్, లక్ష్మాపూర్ గ్రామాల్లోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీలు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

సిరికొండ: మహాశివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో రామలింగేశ్వరిని దర్శనానికి మూడు జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు.సిరికొండ గ్రామానికి తొమ్మిది కిలో మీటర్ల దూరాన దట్టమైన అడవీలో వెలిసిన లొంక రామలింగేశ్వరున్ని దర్శించుకుని మొక్కులు ముట్ట జెప్పడానికి నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్లా జిల్లాల నుంచి శనివారం భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలాయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నవనాథ సిద్దులగుట్టపై శనివారం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు, మహిళలు శివాలయంలోని సిద్దేశ్వరునికి వచ్చి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుమన్, పీసీ గంగారెడ్డి, మల్లయ్య, మురళీ, సతీష్, చరణ్‌రెడ్డి, నరేష్, ప్రశాంత్, రామాగౌడ్, చక్రవర్తి, భక్తులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌లోని చారిత్రక రాజరాజేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పూరస్కరించుకొని కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో కొలువుదీరిన బాల రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి జాతర ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్దల మధ్య ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ రేగుంట భూమాయిదేవేందర్, గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ అవారి చిన్న బాజన్న, కమిటీ సభ్యులు ఎంపీటీసీ యెనుగందుల వీణ శైలేందర్, ఆలయ పాలక వర్గ సభ్యులు,నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.



ఆర్మూర్ ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనలు చేస్తున్న మంగి మహరాజ్



రామలింగేశ్వరుని దర్శనానికి బారులు తీరిన భక్తులు



ధర్పల్లి సల్లగారిగేలో రథోత్సవం

వినయ్‌రెడ్డికి పలువురి నాయకుల పరామర్శ

ఆర్మూర్‌రూరల్, మార్చి9: ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌కుమార్‌రెడ్డిని శనివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల ఆయన నానమ్మ మృతి చెందడంతో ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడుగు గంగాధర్, నరాల రత్నకర్, నిజాంసాగర్ ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ మిర్దాపల్లి సాయిరెడ్డి, పత్తేపూర్ శ్రావణ్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ శేఖ్ మున్ను, ఖాందేశ్ శ్రీనివాస్, రవిగౌడ్, అయ్యప్ప శ్రీనివాస్, కాశీ రాం, ఆకుల రాము, ఇస్సాపల్లి జీవన్, పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ముక్కెర విజయ్, తదితరులు ఉన్నారు.



వినయ్‌రెడ్డిని పరామర్శిస్తున్న బోధన్ ఎమ్మెల్యే

13న పెన్షనర్ల కుటుంబ సమ్మేళనం

పెద్దబజార్, మార్చి 9:ఈనెల 13న అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా పెన్షనర్ల కుటుంబసమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావ్ తెలిపారు. నగరంలోని పెన్షనర్ల కార్యాయలంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 13న నగరంలోని బస్వాగార్డెన్‌లో ఉదయం 10.30 గంటలకు పెన్షనర్ల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్, జడ్పీ సీఈవో బి.ఉషాలు హాజరవుతున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దత్తాత్రేయరావ్, భోజరావ్, సుదర్శన్, ప్రసాద్‌రావ్, పూర్ణచందర్‌రావ్, సుజన, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావ్

టీయూలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్సిటీల కన్వెన్షన్ ప్రారంభం



ఎస్ఎఫ్ఐ సమావేశానికి హాజరైన ప్రతినిధులు

డిచ్‌పల్లి, మార్చి 9: తెలంగాణ యూనివర్సిటీలో సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీ కన్వెన్షన్ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఆర్ఎల్‌మూర్తి ఎస్ఎఫ్ఐ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొ.ఆమంచి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చివిద్యారంగాన్ని ధ్వంసం చేసిందని విమర్శించారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ యొక్క స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పాఠ్యపుస్తకాలలో డార్విన్ సిద్ధాంతాన్ని చరిత్రకారులైనటువంటి భగత్‌సింగ్, అంబేడ్కర్, గొప్ప మేధావుల చరిత్రలను తొలగిస్తూ బ్రిటిష్ ప్రభుత్వానికి కొమ్ము కాసిన వీరసావర్కర్‌యొక్క జీవి చరిత్రలను పాఠ్యాంశాలలో జోప్పించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ ఐటీపీ ప్రిన్సిపాల్ రామ్మోహన్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విఘ్నేశ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత, జిల్లా కార్యదర్శి అనిల్,ఓయూ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రవి నాయక్, టీయూ కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంధ్యరెడ్డి, దీపిక, నాయకులు మహేశ్, నాగరాజు, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెంజర్లలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ముప్కాల్, మార్చి9: మండలంలోని రెంజర్ల గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమిపూజ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.10లక్షలు మంజూరు కావడంతో సీసీరోడ్డు పనులు ప్రారంభించినట్టు వారు తెలిపారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ చొరవతో నిధులు మంజూరు చేసినందుకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

చికెన్ ధరలు





రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.65,800	రూ.60,700	రూ.760

సినిమా గైడ్ నిజామాబాద్



పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : శైతాన్ (హిందీ)(10.20,1.20, 4.20,7.20,10.20)
స్క్రీన్-2 :గామి(10.00, 1.10, 4.20, 7.35, 10.45)
స్క్రీన్-3 : భీమా (12.20,6.55)
: దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (3.25)
:ఆపరేషన్ వాలెంటైన్ (10.00)
స్క్రీన్-4 : బాబు (1.30)
: రికార్డుబ్రేక్ (4.15)
:మంజుమెల్‌బాయ్స్ (మళయాలం) (7.15)
:ప్రేమలు (10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : భీమా (10.50,1.40,4.30, 7.30,10.30)
స్క్రీన్-2 :ప్రేమలు (1.30,7.30)
:ఆపరేషన్ వాలెంటైన్ (4.30,10.30)
స్క్రీన్-3 :గామి(10.30, 1.30, 4.30, 7.30, 10.30)

దేవి :ప్రేమలు (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహోల్ : భీమా (11.15, 2.15, 6.15 9.15.)
నటరాజ్ : శైతాన్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : గామి (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్